

# పుస్తక పరిచయం




**Published By:**

Kalakeli Publications
PITHAPURAM, AP
533 450; Phone: 08869 - 52208

**Available at:**
All leading book stores

**కవిత్వాన్ని** చదివి, అర్థం చేసుకుని, ఆస్వాదించి, ఆనందించాలంటే ఒక విధమైన అభిరుచి ఉండాలి, రసహృదయం కావాలి. తెలుగులో వచ్చే కవితా సంపుటాలని ఎంతమంది నిజమైన కవితాదృష్టితో చదివి ఆనందిస్తున్నారన్నది ప్రశ్నార్థకమే.! ఇలాంటి వాతావరణంలో ఒక యువకవి (ఇటీవలే కవిత్వం వ్రాయడం ప్రారంభించిన కవి అనే అర్థంలో) ప్రచురించిన రెండు కవితా సంపుటాల్లోని దాదాపు 150 కవితలని ఒక లబ్ధప్రతిష్ఠుడైన కవితావిమర్శకుడు సమగ్రంగా విశ్లేషించడం అత్యంత అరుదైన ప్రక్రియ. కవి మువ్వా(క్రాంతి) శ్రీనివాసరావుగారు తన 53వ ఏట కవిత్వాన్ని వ్రాయడం ప్రారంభించి పుంఖాను పుంఖాలుగా కవితలు వ్రాయడమే కాక, ఏకగ్రీవంగా కవిత్వాభిమానులందరితో ప్రశంసలు పొందుతున్నారు. రెండేళ్ళలో రెండు కవితా సంపుటాలని ప్రచురించారు (వీటి పరిచయం ఇదే శీర్షికలో కౌముది గత సంచికల్లో వచ్చాయి). ఈ కవితలని చదివి(చదివించుకుని), ఆ కవితల్లోని నిబద్ధతకీ, నిజాయితీ, నవ్యత్వానికీ ముగ్ధులైన ప్రసిద్ధకవీ, విమర్శకులూ ఐన అవంత్స సోమసుందర్‌గారు ఈ 'కవితా విపంచి క్రాంతి గీతాలు' అనే పుస్తకాన్ని వ్రాశారు. చాలా కవితా పరిచయాల్లో ఉన్నట్లు కేవలం కవితల్లోని పంక్తులఉదాహరణకి పరిమితం కాకుండా, ఒక్కో కవితనీ కూలంకషంగా చర్చించారు. పరిమితులుంటే, లోపాలనిపిస్తే నిర్మొహమాటంగా చెప్పారు. శ్రీనివాసరావుగారి కవితల్లోని ఉత్తమ గుణాలని మరింత కవితాత్మకంగా వివరించడం సోమసుందర్ గారికి మాత్రమే చేతనైన కళ. కేవలం కవితా ప్రశంసకే పరిమితం కాకుండా సందర్భోచితంగా కవితా రచనా ప్రక్రియలోని సూక్ష్మమైన అంశాలెన్నింటినో సరళంగా వివరించారు సోమసుందర్ గారు. ఈ పుస్తకం చదివాక మళ్ళీ శ్రీనివాసరావుగారి కవితలు చదవాలనిపిస్తుంది, మళ్ళీ చదివినప్పుడు ఆ కవితల్లోని మార్మికత కొత్తకోణంలో దర్శనమిస్తుంది. సోమసుందర్‌గారి వయసు ప్రస్తుతం 91 సంవత్సరాలు. ఈ పుస్తకంలో ఆయనే పేర్కొన్నట్లు ఆయనకు అంధత్వం ప్రాప్తించి అక్షరాలని దూరం చేసింది. శరీరంలో సర్వశక్తులూ హరించుకుపోయాయి. మిత్రులో, హితులో అక్షరాలు అందిస్తే తప్ప ఆలోచించే శక్తి కలగడంలేదు. ఐనా సెల్ఫ్ పిటీకి లోనుకాని తనమే సోమసుందర్‌గారితో ఈ పుస్తకం వ్రాయించింది. ఒకరు చదివి వినిపిస్తే విని, ఆయన డిక్టేట్ చేయగా మనముందుకి వచ్చిన విశిష్టమైన పుస్తకం ఈ 'కవితా విపంచి క్రాంతి గీతాలు'. ఇది కేవలం విమర్శనా గ్రంథమో, పరిచయ పుస్తకమో, ప్రశంసా వ్యాసమో కాదు - 'వ్యాఖ్యానాత్మక విమర్శ'. అంత సీనియర్ రచయితని కదిలించి, అననుకూల పరిస్థితుల్లో సైతం ఈ పుస్తకం రచించేంతటి స్ఫూర్తిని కలిగించిన మువ్వాశ్రీనివాసరావుగారి కవితా శక్తిని అభినందించక తప్పదు..!

***




**For Copies**
B.Narsan
1-1-276/A, Flat# 104
RK Apartments, Street# 1
Chikkadpalli, HYDERABAD – 500 027
Cell: 9440128169

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI(Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA

"**నిజాయితీ** నిండిన సృజనాత్మకత రావాలంటే జీవిత రథచక్రాల కింద పడి నలగాలి" అని అనుభవజ్ఞులు చెప్పినట్లే, జీవిత రథచక్రాల కింద పడి నలుగుతూనే భయంకర వాస్తవాలని కవిత్వీకరించిన అసలు సిసలైన సామాజిక కవి అలిశెట్టి ప్రభాకర్. 1980 దశకంలో అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం చదవని, ప్రభావితంకాని, మెచ్చుకోని కవిత్వాభిమానులు లేరు అనడంలో అతిశయోక్తిలేదు. 'సిటీ లైఫ్ ' శీర్షికలో ఆరేళ్ళపాటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రభాకర్ వ్రాసిన లఘు కవితలు (తనే బొమ్మలు వేసుకున్నాడు) తెలుగు పాఠకలోకాన్ని ఒక కుదుపు కుదిపాయి. చిత్రకారుడుగా వృత్తిజీవితాన్ని ప్రారంభించి, కవిగా కొనసాగిన అలిశెట్టి ప్రభాకర్, తన కవితలకి తనే చిత్రాలు వేసుకుని చిత్రకవితలుగా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళాడు. ఇతను నిర్వహించిన కవితా ప్రదర్శనలు ఆనాటి యువతరంలో ఒక పెద్ద సంచలనమే కలిగించాయి. అతడి కవిత్వంలో అలంకారాలు, ఉపమానాలు, అందమైన పదచిత్రాలు.. ఇవికాదు కనిపించేవి - నగ్నజీవన వాస్తవాలు, ఆలోచనలని కలచివేసే సామాజిక సమస్యల చిత్రణ, మన చుట్టూ నిత్యం తిరుగుతున్నా మనం పట్టించుకోని అభాగ్యుల ఆక్రందనలు - ఇవీ ప్రభాకర్ కవిత్వానికి కవితా వస్తువులు. ప్రకృతి, ప్రణయం .. ఇలాంటివి ఈ కవితల్లో కాగడావేసి వెదికినా కనిపించవు. జీవితాంతం నిబద్ధతతో కవితలు వ్రాసిన ప్రభాకర్ లాంటి కవులు అత్యంత అరుదుగా తారసపడుతుంటారు. ఒక వైపు దుర్భరమైన పేదరికం, మరో వైపు సాలెగూడులాంటి నగరజీవితంలో చిక్కుకుని బయటకు రాలేని నిస్సహాయత , ఇంకోవైపు రోజురోజుకీ క్షీణించిన ఆరోగ్యం - ఈ జీవన నేపథ్యంలో ప్రభాకర్ వ్రాసిన కవితలు మానసిక ఉదాసీనతని దహనంచేసే నెత్తుటి మంటలు, దున్నపోతు సమాజంపై కొరడా దెబ్బలు. వీటిల్లో ఎన్నో లఘుకవితలు 'కోటబుల్ కోట్స్' లా ఎన్నో సందర్భాల్లో ఇప్పటికీ ఉదహరించబడుతున్నాయి. వాటిల్లో ఒక కవిత " **వేశ్య** - తను శవమై / ఒకరికి వశమై / తనువు పుండై / ఒకడికి పండై / ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసిస్సై..!". కేవలం సమాజాన్ని ఎక్స్ రే తీసిచూపించడమే కాదు, చైతన్యాన్నివ్వడం కూడా ప్రభాకర్ కవితల్లోని ఒక లక్షణం. ఉదా. " **గుండెసైన్యం** - చీకట్లో జడుసుకుంటే / ఒక చెట్టే నీ చుట్టూరా / అరణ్యమై భయపెడుతుంది!/ గుండెంటూ కలిగుంటే / నీ వెంట అదే పెద్ద / సైన్యమై నిలుస్తుంది" . " **కవి - సమ్మెట** - చదివిన కవిత "చలి - ముదుసలి' / కప్పించుకుంది కశ్మీరు శాలువా" లాంటి కవితలూ ప్రభాకర్ కవిత్వంలోని మరోకోణం. లోగడ విడివిడిగా సంపుటాలుగా వచ్చిన అలిశెట్టి కవితలన్నింటినీ ఒక్కచోట చేర్చి, 7 విభాగాలుగా వందలాది కవితలని కూర్చి 335 పేజీల పుస్తకంగా మన ముందుకి తీసుకొచ్చారు ప్రభాకర్ మిత్రబృందం. ఈ బృహత్ కవితా సంపుటికి సంపాదకులు జయధీర్ తిరుమలరావు, నిజాం వెంకటేశం, బి.నర్సన్. సరిగ్గా తన 39 వ పుట్టినరోజున జనవరి 12, 1993 న మరణించిన అలిశెట్టి ప్రభాకర్ కవితలని ముందుతరాల కందించే ప్రయత్నాలు చేస్తున్న ఆయన మిత్రబృందాన్ని ముఖ్యంగా బి.నర్సన్‌గారిని అభినందించి తీరాలి.

***